



రాస్తారోకో చేస్తున్న సిఐటియు, ఏఐటియుసి నాయకులు

వినతులు.. విన్నపాలు

సమస్యలను పరిష్కరించండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అర్జీదారులకు అర్థవంతమైన నాణ్యమైన సమాధానాలు ఇస్తూ సమస్యలను పరిష్కరించాలని, అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్, డీప్యూటీ కలెక్టర్ భవాని, డిఆర్‌డిఏ పిడి తులసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 112 అర్జీలు అందగా శాఖల వారి వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 96 , పశు సంవర్ధక శాఖ 1, పోలీస్ 4, డిపిఓ పంచాయతీ 1, పౌరసరఫరాలు 1, డిఆర్‌డిఏ 2, డిఎం అండ్ హెచ్ 1, నగరి మున్సిపల్ కమిషనర్ 1, ఎంపిడిఓ ఎస్ ఆర్ పురం 1, ఎంపిడిఓ వెదురుకుప్పం 1, పిఓ సమగ్రశిక్ష 1, ఏడి సెంట్రల్ కో అండ్ అప్ రేట్ బ్యాంక్ 1, ఇరిగేషన్ 1 వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు అర్జీలను అందజేశారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి : ఎస్పీ

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పిని, చిత్తూరు డీఎస్పీ టి.సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 25 ఫిర్యాదులు అందగా వాటి వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ తగాదాలు 3, వేధింపులు 1, భర్త వేధింపులు 1, డబ్బు తగాదాలు 2, భూ తగాదాలు 16, దారి సమస్యలు 2.



ప్రజా ఫిర్యాదుల స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

'సకాలంలో వినతుల పరిష్కారం'

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ చెప్పారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈకార్యక్రమంలో భాగంగా అందే వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని, పూర్తిస్థాయి విచారణ నివేదికలను సమర్పించాలన్నారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, వినతుల పరిష్కారం స్థితిగతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మొత్తం నాలుగు ఫిర్యాదులు అందాయి. ఎంహెచ్‌లు డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎసీపీ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, సీఎంఎం గోపి, అధికారులు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తున్న సహాయ కమిషనర్ ప్రసాద్

బోయకొండ బాధితులకు షాపులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కలెక్టర్‌కు సిఐటియు వినతి

బోయకొండ గంగమ్మ దేవస్థానం అభివృద్ధి పేరుతో దౌర్జనంగా పేదల ఇల్లు, షాపులు తొలగించారని వారికి న్యాయం చేయాలని మంగళవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు కలెక్టరుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ 2019 సంవత్సరంలో దేవస్థానం అభివృద్ధి పేరుతో గత 30 సంవత్సరాలుగా స్థానికంగా ఉన్న పేదలు చిన్నపాటి ఇల్లు, షాపులు ఏర్పాటు చేసుకొని భక్తులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారి షాపులు ఇళ్లను దౌర్జన్యంగా తొలగించి పెద్దపెద్ద కాంప్లెక్సు నిర్మించారని తెలిపారు. అయితే ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలం ఇవ్వకుండా అన్యాయం చేశారని తెలిపారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి వలన బాధితులు నష్టపోయారని వారికి ప్రభుత్వం స్థలం కేటాయించి ఆదుకోవాలని కోరారు. దేవస్థానం నిర్మించిన షాపులలో వీరికి ఉపాధి కోసం కేటాయించాలని కోరారు. దీనిపై కలెక్టరు స్పందిస్తూ కొంచెం సమయం తీసుకుని వీటిపై సమగ్రంగా అధ్యయనం చేసి బాధితులకు న్యాయం చేస్తానని తెలిపారు.

యానాదుల భూములు ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఫిర్యాదు

బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలో ఉన్న యానాదుల భూములను అగ్రకులస్తులైన ఏకాంబరం నాయుడు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మంగళవారం బాధితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనెంబర్ 61లో ఉన్న ఊరిగుట్ట భూమి అనేక సంవత్సరాల యానాదులుగా అనుభవంలో ఉందని ఆస్థలాన్ని శ్మశానంగా ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఏకాంబరం నాయుడు రెవెన్యూ అధికారులతో కలిసి ఆ భూమిని పట్టా చేసుకోవాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆ స్థలంలో దౌర్జన్యంగా బోరు వేయడం, పైపులైన్లు, కరెంట్ ఫోల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. గమనించిన యానాదులు తహాశీల్దార్ దృష్టికి తీసుకుని రావడంతో అప్పటి పనులు ఆపి మళ్లీ మొదలు పెట్టారని అడ్డుకున్న యానాదులపై దాడి చేయడంతోపాటు కులం పేరుతో దూషించారని తెలిపారు. తరతరాలుగా ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్న యానాదుల సమస్యపై స్పందించి వారికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

డీప్యూటీ కలెక్టర్‌తో సర్వే చేయించి న్యాయం చేస్తాం: కలెక్టర్

సమస్యను క్షుణ్ణంగా విన్న కలెక్టర్ స్పందిస్తూ డీప్యూటీ కలెక్టర్ భవానిని పిలిచి రెండు రోజుల్లో సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని, తానే స్వయంగా చూసి న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు యానాది సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వాడ గంగరాజు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చిత్తూరు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నాయకులు కాంజీవరం సురేంద్రన్, దాసరి చంద్ర నాయకత్వంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ 9 వేల కోట్ల పెట్టుబడికి 58వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశరని అన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుండి 30లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందని తెలిపారు. దీంతో అనివార్యంగా నష్టాలలోకి విశాఖ ఉక్కును నెట్టాలని బీజేపీ మోడీ ప్రభుత్వం భావిస్తోందని, టిడిపి, జనసేన, కూటమిపై, పార్లమెంట్ సభ్యులు బలంపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిచేసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపడానికి కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. ప్రభుత్వమే సొంత ఘనులు విశాఖ ఉక్కుకు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో, 64 ఎంపీల రాజీనామాలతో, 32 వేల ఎకరాల రైతుల భూమిని సేకరించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు సిద్ధంగాలేరని, విశాఖఉక్కు ఫ్యాక్టరీలో 45వేల మంది కార్మికుల కుటుంబాలు బతుకుతున్నారని పరోక్షంగా మరో లక్ష మందికి ఉపాధి అవకాశం కల్పిస్తున్న విశాఖ ఉక్కును ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేసి ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. అవసరమైతే మరో పోరాటానికి, ప్రాణం తాగానికైె సిద్ధం కావాలని కార్యకర్తలకు కార్మికవర్గానికి పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్త, ఏఐటీయూసీ నాయకులు కే.రమాదేవి, విసి.గోపీనాథ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.మునిరత్నం నాయుడు, సిఐటియు నాయకులు ఆరోగ్యదాస్, చిట్టెమ్మ, ఏఐటీయూసీ నాయకులు ఎస్.జయ కుమారి, పి.రఘు, కృష్ణ, మురళి, సంతోష్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి విజయ గౌరీ, నగర అధ్యక్షురాలు బి.కుమారి, ఏ.కవిత, వి.కోమల పాల్గొన్నారు.

12న గ్రేడ్-2, విఆర్ఓల బదిలీల కౌన్సిలింగ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:


ఈనెల 12న గ్రేడ్-2, విఆర్ఓల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు చిత్తూరు జిల్లా లోని గ్రేడ్- 2, విఆర్ఓల బదిలీలకు సంబంధించి ఈనెల 12వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హల్‌లో గ్రేడ్ 2, విఆర్ఓలకు బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ఆ ప్రకటనలో తెలిపారు.

ఆర్ అండ్‌బి డీఈగా సిహెచ్. రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ఆర్ అండ్ బి డివిజన్ డీఈగా సిహెచ్.రాజేంద్ర ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా నుంచి పుంగనూరు ఆర్ అండ్ బి డీఈగా రావడం జరిగింది. గతంలో ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్ ఎఫ్ఎసిగా కొనసాగుతున్నడంతో ప్రస్తుతం ఆ శాఖ పూర్తి బాధ్యతలుగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్లు అన్ని మరమ్మతులు గురి అయినట్లయితే వాటి అన్నింటినీ గుర్తించి త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



విజయవాడ వరద బాధితుల సహాయార్థం బోర్డ్ ఆఫ్ యాన్ సెస్ట్రాల్ అండ్ ఆల్టర్నేటివ్ మెడికల్ సైన్సెస్ (బాస్) వారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కి రూ.74,657ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దాతలు రవి, అంజాద్, కిషోర్, భాస్కర్ పాల్గొన్నారు.



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయార్థం చిత్తూరు జిల్లా ప్రైవేటు బస్సుల ఆపరేటర్ అసోసియన్ వారు రూ.2,0,0000లను, పివికెఎన్ వాకర్స్ అసోషియేషన్ వారు రూ.50 వేల చెక్కును, విజ్ఞాన సుధ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ న్యూయార్క్ స్కూలు వారు రూ.85,345ల చెక్కును ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న జిజేయం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా విరాళంగా అందజేశారు.

వరద బాధితులకు అండగా నిలిచా : ఎంపి

ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. విజయవాడ వరద బాధితులకు ఆపన్నహస్తాన్ని అందించి, సమర్థవంతమైన నాయకత్వానికి నిలువుటద్దంగా నిలిచారని కొనియాడారు. ఢిల్లీలో నుంచి ఎంపి వరద భీభత్సంపై స్పందించారు. విపత్తుల నుంచి ప్రజలను రక్షించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చిత్తశుద్ధితో పనిచేయడం అభినందనీయమన్నారు. తాను సైతం బెజవాడ బాధితులకు అండగా నిలిచానని ఎంపి తెలిపారు.

కుప్పం టౌన్ : వరద బాధితులకు కుప్పం పట్టణం 5వ వార్డుకు చెందిన మహిళలు అండగా నిలిచారు. కమిషనర్ వార్డుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కమిషనర్ శ్రీనివాసరావు అనిమిగానిపల్లి ప్రాంతంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం స్థానిక మహిళా గ్రూపు సభ్యులు వరద బాధితులకు సహాయంగా రూ.10వేల చెక్కును కమిషనర్‌కు అందజేశారు.

మ్యాథ్స్ మ్యాజిక్ షో



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక కన్నన్ జూనియర్ కళాశాల ఆవరణంలో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మ్యాథ మ్యాజిక్ షో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత అవధాన గురువు, జిల్లా జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు హసనాపురం అరుణ శివప్రసాద్ మ్యాథ మ్యాజిక్ షోను నిర్వరహించారు. విద్యార్థులకు గణితంపై భయాన్ని పోగొట్టి గణితంలో గల తార్కిక ఆలోచనలను పెంపొందించేందుకు గణితంలో మ్యాజిక్ షోను నిర్వహించారు. అనంతరం గణిత అవధాని అరుణ శివప్రసాద్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు పూల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12న కన్నన్ జయంతిని పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు గణితంలో మెలకువలను తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి మునిరత్నం, మురళి, నరసింహుల నాయుడు, లోకనాథం, యూసఫ్, సిద్ధ లింగం పిళ్ళయి, అమర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ఆలయ భూములను గుర్తించండి

ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు

పలమనేరు నియోజకవర్గంలో దేవాదాయశాఖ ఆధీనంలో గల ఆలయాలకు సంబంధించి అన్యాక్రాంతమైన భూములను వెంటనే గుర్తించి కాపాడాలని ఎండోమెంట్ అధికారులకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. పలమనేరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్‌తో పాటు వారి సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. పలమనేరులోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమైనట్లు తన దృష్టికి ఫిర్యాదులు అందాయని, వెంటనే ఆలయ భూములను గుర్తించి కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎక్కడెక్కడ ఆలయాలకు సంబంధించిన భూములు ఉన్నాయో ఈ సందర్భంగా ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆలయ ఆస్తుల ద్వారా చేకూరుతున్న ఆదాయాలతో భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు ఆలయాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా స్థానిక శివాలయంలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి చేయనున్న గాలిగోపురం, కోనేరు తదితర పనులకు సంబందించిన నమూనాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆలయ సిబ్బంది భాస్కర్ రెడ్డి, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

జీవో 85ను వెంటనే రద్దు చేయాలి

10 నుంచే దశల వారీగా ఆందోళన: డాక్టర్ హేమశ్రీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: వైద్య సిబ్బంది విధులకు ఆటంకం కలిగించే జీవో 85ను వెంటనే రద్దు చేయాలని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమశ్రీ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హేమశ్రీ మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధులకు ఆటంకం కల్పించే జీవో నంబర్ 85ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ జీవో ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందని, అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమన్నారు. దీని వలన వైద్యుల వృత్తి, ప్రగతికి తీవ్రనష్టం కలుగుతుందని అన్నారు. గత రెండు నెలల కాలంగా జీవో 85ను రద్దు చేయాలని అధికారులు, ఎమ్మెల్యేలకు వినతులు సమర్పించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలను వణికించిన కరోనా కాలంలో కూడా ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలు అందించిన వైద్యులపై కక్ష సాధింపుతో జీవో 85ను అమలు చేయడం మంచి కాదని, పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ఇది ముఖ్యంగా గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందన్నారు. జీవోకు వ్యతిరేకంగా 10వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జిలు ధరిరంచి విధులు నిర్వహిస్తామని, 11, 12 రెండు రోజుల పాటు సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగించడం జరుగుతుందన్నారు. 13న ప్రభుత్వం స్పందించకుంటే పీహెచ్సీ వైద్యులు అత్యవసర సర్వీసులను మినహాయించి అన్ని రిపోర్టింగ్లు, వీసీ, టీసీతోపాటు అధికారిక కమ్యూనికేషన్లు నిలిపివేయడం జరుగుతుందన్నారు. 15న చలో విజయవాడ కార్యక్రమం జరుగుతుందని, 16 నుంచి జీవోను రద్దే చేసే వరకు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హేమశ్రీ

తాగునీటి కష్టాలు తీరేనా..?

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని కోనపరెడ్డిపల్లి గ్రామంలో గత రెండు నెలలుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురైన మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలోని తాగునీటి బోరులో నీరు పుష్కలంగా ఉన్నా కరెంట్ సరఫరా లేకపోవడంతో తాగునీటికి అవస్థలు తప్పడం లేదని గ్రామ మహిళలు తెలిపారు. ఈ సమస్యపై గత ఆరు నెలలుగా విద్యుత్ శాఖ అధికారులు, మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులకు అర్జీలను అందజేస్తున్నా పట్టించుకున్న పాపానపోలేదన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయానికి పలుమార్లు వెళ్లి ఏఈకీ, లైన్‌మెన్‌కు తమ సమస్యను మొరపెట్టుకున్నా పట్టిచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు లేక రోజూ రెండు కిలోమీటర్లు వెళ్లి వ్యవసాయ బోర్ల నుంచి తెచ్చుకోవల్సి వచ్చిందని, రైతులు రోజు నీరు ఇవ్వడం కుదరంటూ కసురుకుంటున్నారని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసన్న మహిళలు

'చేపల మార్కెట్‌కు స్థలం కేటాయించండి'



ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు పట్టణంలో చేపల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి మార్కెట్‌కు స్థలం కేటాయించాలని ఆసంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణమూర్తి కోరారు. వెంకటేశ్వర మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చేపల వృత్తిపై ఆధారపడి జీవించేవారు చాలామంది ఉన్నారని చెప్పారు. చాలా ఏళ్లుగా చేపల మార్కెట్ స్థలం కేటాయించాలని అధికారులకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నాం కానీ తమకు స్థలం ఇప్పటివరకు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మార్కెట్ స్థల కేటాయింపుకై అనేక ఆందోళన కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. కావున ఇప్పటికైనా అధికారులు చేపలు మార్కెట్‌కు స్థలం కేటాయించాలని కోరారు. ఫిషర్ మాన్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులను చేర్చుకోడానికి అనుమతులు కోరారు. దీనిపై వినతిపత్రం అందించారు. దీనికి సానుకూలంగా స్పందించిన డిప్యూటీ తహసిల్దార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కామేశ్వరరావు, దొరస్వామి, రఘుబాబు, ప్రకాష్‌లు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పౌష్టికాహారం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండలంలోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో శుభోన్ భోజనం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆ పాఠశాల హెచ్ఎం కేశవు అన్నారు. మంగళవారం డీఎం పురం ఉన్నత పాఠశాలలో దాతలు అందించిన పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పులుపు మేరకు శుభోన్ భోజన కార్యక్రమానికి దాతలు అధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారని తెలిపారు. మంగళవారం మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఎ ఆ పాఠశాల పూర్వవిద్యార్థి శేషాద్రి పలు రకాలైన విందు భోజనాన్ని పిల్లలకు అందించారన్నారు. దాత శేషాద్రి మాట్లాడుతూ పేద పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించి ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రతి రోజు దాతలు కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు ముందుకొచ్చి విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించి పిల్లలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిత, సరస్వతి, మాలతి, సుమతి, తిరుమలరాజు, డిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, రంజిత కుమార్, రాములు, పాఠశాల వైస్ చైర్మన్ సంధ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

అంగన్వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఐసీడీఎస్ కార్వేటినగరం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్వేటినగరం ఐసీడీఎస్ పరిధిలోని వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాల్లో ఉన్న అగన్వాడీ వర్కర్లు, మినీవర్కర్లు, హెల్పర్ల ఉద్యోగాలని భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఆయా ఉద్యోగాలకు తగిన విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోపు ధరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్హత కలిగిన అభ్యర్థులు 12 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ ధరఖాస్తులను కార్వేటినగరం ఐసీడీసీ ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలని తెలిపారు.

గంగాధర నెల్లూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలాల్లో ఖాళీ ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఒ వినతశ్రీ తెలిపారు. పెనుమూరు మండలంలోని చిన్న కలికిరి అంగన్వాడీ వర్కర్ పోస్ట్ (బీసీ–ఎ), పాళ్యం యానాది కాలనీలో మినీ అంగన్వాడి వర్కర్ పోస్ట్ (ఎస్టి), పుట్టగానిపల్లె మినీ అంగన్వాడి వర్కర్ పోస్ట్ (ఓసీ), కే. గొల్లపల్లి అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీ), నంజరపల్లె అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీ), గంగాధర నెల్లూరు మండలంలోని కలిజవేడు అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీ), అగరమంగళం అంగన్వాడీ హెల్పర్ పోస్ట్ (ఎస్సీ), కే.వెంకటాపురం దళితవాడలో అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఎస్సీ), కోటాగరం దళితవాడలో అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఎస్సీ) తూగుండ్రం పంచాయతీ దాసర పల్లె అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీ), తిరువీధి కుప్పం అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీ), కట్టకిందపల్లె అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఎస్సీ), పాలసముద్రం మండలం బాలక్రిష్ణాపురం అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీ), ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తును ఈనెల12 నుంచి 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ కార్యాలయంలో చేర్చాలన్నారు.

పలమనేరు: పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సంబంధించి అంగన్వాడీ సహాయకురాలు పోస్టులు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని సిడిపిఒ ఇందిరా ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గంగవరం మండలం గంగవరం అంగన్వాడీ సహాయకురాలు 1, పెద్దపంజాణి మండలం బందార్లపల్లిలో అంగన్వాడీ సహాయకురాలు ఒక పోస్టు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హత గల వారు పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వి కోట, బైరెడ్డిపల్లి: ఐసిడిఎస్ బైరెడ్డిపల్లి ప్రాజెక్టుకు సంబంధించి వికోట మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ సిడిపిఒ కే.మాధవిలత ప్రకటన తెలిపారు. మండల పరిధిలోని గాండ్లపల్లి, తాపేపల్లి గ్రామాలకు సంబంధించి ఖాళీగా ఉన్న రెండు అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు పదవ తరగతి పాసైన అర్హులైన వివాహిత మహిళలు దరఖాస్తులు ఐసిడిఎస్ కార్యాలయంలో అందించాలని వారు తెలిపారు.

కుప్పం టౌన్ : ఐసిడిఎస్ కుప్పం ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ హెల్పర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కుప్పం సిడిపిఒ ప్రకటన ద్వారా తెలియజేశారు. గుడుపల్లి మండలం జాతికర్తనపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్ ఉద్యోగానికి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి, స్థానికంగా నివాసం ఉన్న బీసీ ఏ కులానికి చెందిన వివాహిత మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు స్థానిక సిడిపిఒ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సోమల: మండలంలోని ఫిరంగుల గుట్ట, ముంద్రివారిపల్లి గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రంలో మినీ అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాల పోస్టుల భర్తీకి పదవ తరగతి పాసై స్థానిక వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చుని సిడిపిఒ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. పుంగనూరు ప్రాజెక్టు పరిధిలోని ఈ రెండు పోస్టులకు మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ కోసం ఎస్టి కులానికి చెందిన వారై ఉండాలని, అంగన్వాడి సహాయకురాలి పోస్ట్ కోసం దరఖాస్తు చేసేవారు బీసీ డి కేటగిరీకి చెందిన వారు అర్హులని తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్ఐ



అవగాహన ర్యాలీలో ఎస్ఐ, సిబ్బంది

ప్రజాశక్తి- కార్వేటినగరం: హెల్మెట్ వాడకం తప్పనిసరి అని, హెల్మెట్ వాడటం ప్రాణానికి శ్రీరామరక్ష అని ఎస్ఐ రాజ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లోని సిబ్బంది హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలో భాగంగా హెల్మెట్ వాడకం ప్రధానమైనదన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపడుకోవడానికి హెల్మెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించండం విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ క్రికెట్ విజేతగా తయ్యూరు యువత




ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలు దళవాయిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో ఎస్ఆర్ పురం మండలం పెద్దతయ్యూరు గ్రామానికి చెందిన క్రీడాకారులు విజేతగా నిలిచారు. గెలుపొందిన జట్టుకు రూ.50 వేల నగదు బహుమతితో పాటు కప్ స్థానిక సర్పంచ్ అందించారు. క్రీడాకారులకు గ్రామస్తులు పెద్దలు బాణాసంచా కాల్చి మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ వరదమ్మ మాట్లాడుతూ క్రీడల వనల మానసిక ఉల్లాసంతో పాటు గ్రామయువతలో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఉపయోగపడుతాయని కనుక పంచాయతీ స్థాయిలో క్రీడాలను ప్రోత్సహించడం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

మాతృ,శిశు మరణాలు జరగకుండా చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో భవిష్యత్‌లో మాతృ,శిశు మరణాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, డిఎంఆర్ జిల్లా నోడల్ ఆఫీసర్ జానకిరావు, మెడికల్ ఆఫీసర్లుతో కలసి 2024 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు జిల్లాలో జరిగిన 5 మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భవిష్యత్‌లో మాతృ, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. గర్భవతికి అధిక రక్తపోటు, రక్తహీనత, పౌష్టికాహార లోపం వలన కాన్పు సమయంలో జరిగే మాతృ మరణాలను వైద్యాధికారులు ముందస్తు ప్రణాళికల ద్వారా నివారించాల అన్నారు. సరైన పద్ధతిలో గర్భవతులకు కౌన్సిలింగ్ చేయాలని, గ్రామీణ స్థాయిలోని హైరిస్క్ గర్భవతులకు అన్నీ పరీక్షలు నిర్వహించి ప్రణాళిక ద్వారా కాన్పుకు వారం రోజులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పిస్తే వారికి ఆర్థిక ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఎక్కడైనా మాతృ మరణాలు జరిగితే సంబంధించిన డాక్టర్లు పై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తల గ్రామస్థాయిలో నిరంతరం పర్యటించి గర్భవతులను గుర్తించి వారికి సరైన జాగ్రత్తలు చెప్పుతూ సకాలంలో వైద్యసేవలు అందించినట్లు అయ్యితే మాతృశిశు మరణాలను తగ్గించవచ్చునని తెలిపారు. ఏరియా ఆసుపత్రిలోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల మందుల అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డ్యూటీ సమయంలో ఏఒక్క వైద్య సిబ్బంది లేరని తెలిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గర్భవతులు బాలింతలు మరణించకుండా ముందస్తు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆర్థిక సాయం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌ని విభిన్న ప్రతిభావంతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 23న అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం సందర్భంగా వారికి జిజేయం చారిటబుల్ ఫౌండేషన్ తరపున రూ.50వేల ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే అందజేశారు.

వ్యర్థాలు తొలగింపు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రజల ఆరోగ్యం కోసం వ్యర్థాలను తొలగించినట్లు సర్పంచ్ భాష్యం ద్రాక్షాయని తెలిపారు. మంగళవారం మండలంలోని గుంతూరు పంచాయతీలో గృహాల సముదాయంలో గల వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో గృహాల సముదాయాల సమీపంలో అధికంగా పిచ్చిమొక్కలు పెరిగాయని, మురుగునీటి కాలువలో వ్యర్థాలు నిండిపోయాయని వాటిని తొలగించేందుకు ప్రభుత్వం నూతన మినీ జెసిబిని మంజూరు చేసిందని తెలిపారు. దానిద్వారా గ్రామంలో వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉద్దేశంతో పారిశుధ్య చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల వాణిజ్య విభాగ అధ్యక్షులు భాష్యం వంశీ చౌదరి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

'రాజకీయ వేధింపులను అరికట్టాలి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయమ్మలకు 7నెలల జీతాలను వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాల ఆయమ్మల వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జయకుమారి ఏఐటియుసి చిత్తూరు నగర కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రమాదేవి మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజుని కలిసి వినతి పత్రం సమర్పించారు.

పౌష్టికాహార మాసోత్సవాలు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించినట్లు సిడిపిఒ మాధవీ లత తెలిపారు. మంగళవారం సిడిపిఒ ఆధ్వర్యంలో సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీలు శంకుతల, భాగ్యమ్మ, ముగ్బుల్, విజయకుమారి అంగన్వాడీ సెంటర్‌లో పౌష్టికాహర మాసోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా పౌష్టికాహారం ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

శాస్త్రోక్తంగా రాజగణపతి హోమం

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట పట్టణంలోని జిఎం స్ట్రీట్‌లో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదురోజుల పాటు నిర్వహిస్తున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం ఉదయం వినాయకుడి మండపం ముందు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్ దంపతులు చేతుల మీదుగా అర్చకులు శ్రీ రాఘవేంద్ర విజయ్ స్వామి శాస్త్రోక్తంగా రాజ గణపతి హోమం నిర్వహించారు. అర్బన్ సీఐ శరత్ చంద్ర, టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కన్నా రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అతిథులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించి గౌరవప్రదంగా సత్కరించారు. మధ్యాహ్నం జూలియన్ రాజు తనయుడు అనిల్, సుమశ్రీ దంపతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 700 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యార్థులు సాంఖ్యకశాస్త్రంలో పట్టు సాధించాలి : విసి

ప్రజాశక్తి - క్యాంపస్: విద్యార్థులు సాంఖ్యక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకుంటూ పట్టు సాధించాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సాంఖ్యక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పద్మభూషణ్ ఆచార్య సిఆర్ రావు వారి తల్లిదండ్రులలు సిడి నాయుడు, ఆర్కాట్ లక్ష్మీకాంతమ్మ పేర్ల జ్ఞాపకార్థం ఆయన విభాగం తరఫున రెండు లక్షల రూపాయలను అతిథి ఉపన్యాసం కొరకు వితరణ ఇచ్చారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లుగానే ఈ సంవత్సరమూ సెప్టెంబర్ 10వ తేదీన ఎస్వీయూ సెనేట్ హాల్లో మంగళవారం విభాగాధిపతి ఆచార్య బి. సరోజమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు సాంఖ్యక శాస్త్రం సబ్జెక్టులో పట్టు సాధించడం ద్వారా ఎన్నో ఉన్నతమైన అవకాశాలను అందుకోవచ్చు అన్నారు. ప్రొఫెసర్ సి ఆర్ రావు వర్సిటీలోని సాంఖ్యక శాస్త్ర విభాగానికి ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు మాట్లాడుతూ ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు. సాంఖ్యక శాస్త్రం చదివే విద్యార్థులకు ఎన్నో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని వాటిని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తులసి రామకష్ణారెడ్డి మాట్లాడుతూ ఆచార్య సిఆర్ రావు దేశంలోనే గొప్ప సాంఖ్యక శాస్త్రవేత్త అని కొనియాడారు. ఆయన రూపొందించిన సాంఖ్యక శాస్త్ర మోడల్స్ ఎంతో పేరుగాంచాయన్నారు. ఆచార్య ఎం ఆర్ శ్రీనివాసన్ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. వెంకటరమణారెడ్డి, ఆచార్య బాల సిద్ధమని, ఆచార్య జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



లాయల్ టెక్స్‌టైల్ లాకౌట్ అన్యాయం

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - నాయుడుపేట

మండలంలోని మేనకూరు ఎస్సీ జడ్ లాయల్ టెక్స్‌టైల్ పరిశ్రమ లాకౌట్ విధించడం అన్యాయమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య అన్నారు. ఉన్నపళంగా లాకౌట్ ప్రకటించి కార్మికులను వీధుల్లోకి నెట్టడంతో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ విషయమై గతంలో శుక్రవారం నాయుడుపేట తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించగా ఎసిఎల్, డిసిఎల్‌తో సంప్రదించి సోమవారం సంప్రదింపులు జరుపుతామని చెప్పడంతో ధర్నాను విరమించారు. అయితే అధికారుల నుంచి ఎటువంటి చర్చలు లేకపోవడంతో మంగళవారం టెక్స్‌టైల్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో డిసిఎల్, ఎసిఎల్ లాయల్ పరిశ్రమ వద్దకు రావడంతో కార్మికులు మధ్యాహ్నం భోజనం చేయకుండానే సంప్రదింపుల్లో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు యాజమాన్యానికి, కార్మికులకు మధ్య సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. అయితే యాజమాన్యం లేబర్ డిపార్టుమెంట్ సూచన మేరకు మేనేజ్‌మెంట్ బోర్డులో చర్చించుకుని గురువారం ఏ విషయం తెలియజేస్తామని చెప్పారు. అనంతరం అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ లాయల్ టెక్స్‌టైల్ పరిశ్రమ యాజమాన్యం చట్టవిరుద్ధంగా లాకౌట్ చేసే ముందు కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని, కార్మికుల కష్టాన్ని సొమ్ము చేసుకుని, ఇతర రాష్ట్రాలలో వ్యాపారం పెంచుకుని నష్టాల పేరుతో లాకప్ ప్రకటించడం అన్యాయమన్నారు. ఎసిఎల్, డిసిఎల్ సహకారంతో కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద, గురవయ్య, విజయ్‌కుమార్, జయచంద్ర, శివ, దీప, రత్నమ్మ, సీనయ్య, గురవయ్య పాల్గొన్నారు.



యోగాసనాల్లో మహిళా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్

సెప్టెంబర్ నెల చివరి వారంలో జరగబోయే రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలకు ఈనెల 9వ తేదీ సోమవారం తిరుపతి ఎస్వి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జిల్లా స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి. సీనియర్ గ్రూప్ 18 నుంచి 28 సంవత్సరాల వయసులో ఎం.విజయదుర్గ, యం. త్రివేణి, జి సి వర్షిత బ్రాంచ్ మెడల్ సిఎస్సి నాలుగో సంవత్సరం , కే కావ్య శ్రీ, అలేఖ్య, సీనియర్ గ్రూప్ ఏ 28 నుంచి 35 సంవత్సరాల విభాగంలో డి.రేవతి, సి.లావణ్య, ఎం.వి. గౌతమి, సీనియర్ గ్రూప్ బి 35 నుంచి 45 సంవత్సరాల వయసులో డాక్టర్ డి. స్రవంతి, జే.ధనలక్ష్మి లు ఎంపిక అయినట్లు వర్సిటీ వ్యాయామ విభాగాధిపతి ప్రొఫెసర్ జి సారా సరోజినీ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను వర్సిటీ విసి ఆచార్య వన్నెం ఉమ, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఏన్. రజిని అభినందించారు.

బాలాజీ నగర్‌లోనే ఇళ్లు కేటాయించాలి: ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

స్థానికులకు బాలాజీనగర్‌లోనే ఇళ్లు కేటాయించాలని తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు కోరారు. టీటీడీ ఈవో శ్యామలరావుతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం మధ్యాహ్నం టిటిడి పరిపాలనా భవనంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఈఓ శ్యామలరావుకు స్థానికుల సమస్యల పై వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా తిరుమలలోని పూటకూళ్ళమిట్ట, సతురామ్ మఠానికి చెందిన 84 కుటుంబాలు ప్రస్తుతం రిహాబిలిటేషన్ సెంటర్ లో నివాసం ఉంటున్నారు. వీరికి బాలాజీ నగర్ లో ఇళ్ళు కేటాయించాలని ఈఓను ఎమ్మెల్యే కోరారు. మరోవైపు టిటిడి విద్యాసంస్థల్లో పని చేస్తున్న టీచర్లకు హెల్త్ కార్డులు మంజూరు అంశం ఈఓ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్ళారు. ఈఓ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు .

గౌరిపెద్ది సాహితీ సృజన అద్భుతం : స్విమ్స్ వీసీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించడంలో గౌరి పెద్ది రామసుబ్బశర్మ విశేష కషి చేశారని స్విమ్స్ విసి డాక్టర్ ఆర్.వి.కుమార్ చెప్పారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో మంగళవారం గౌరి పెద్ది రామసుబ్బశర్మ 102వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ ఆర్ వి కుమార్ మాట్లాడుతూ, అద్భుతమైన సాహితీ సజన చేసిన ప్రముఖులలో గౌరి పెద్ది ఒకరని అన్నారు. గౌరి పెద్దివారి సాహితీ వైభవం, నవ చండి సంప్రదాయం – వైదికత గురించి తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు 27 సంపుటలు పరిష్కరించడంలో గౌరి పెద్ది వారు విశేష కషి చేశారన్నారు. వైద్యానికి, ఉపాసనకు గల సంబంధాన్ని వివరించారు. ఎస్వీయు విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సర్వోత్తమరావు మాట్లాడుతూ నేటి తరం వారు తమ కంటే ముందున్న గొప్ప తరాన్ని గురించి తెలుసుకోవాలన్నారు. ద్రోణాచలంకు చెందిన ప్రముఖ శతవధాని అవధాని సరస్వతి డాక్టర్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణ శర్మ పాల్గొన్నారు.

శ్రీవారిమెట్టు వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి

టిటిడి ఈవోకు సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా 21 రోజులుగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్న శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. నాగరాజు, టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు టి. సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్రలు టీటీడీ ఇఓకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ ఇఓ శ్యామలరావును సిఐటియు నేతలు మంగళవారం ఉదయం కలిసి శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలను ప్రస్తావించారు. శ్రీవారి మెట్టు నడకదారిలో భక్తులకు గత 26 ఏళ్లుగా సేవలందిస్తున్న చిరు వ్యాపారుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి సమంజసంగా లేదని, పేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అలిపిరి నడకదారిలో పులి కనపడితే శ్రీవారి మెట్టు నడకదారిలో వ్యాపారాలను నిషేధించటం... ఏమి న్యాయమని ప్రశ్నించారు. ఎర్రచందనం స్మగ్లర్లను 164 మందిని పలు దఫాలలో పట్టించారని, అడవులు తగలబడి పోతుంటే ఆర్పడానికి ప్రయత్నించారని, భక్తులకు అనారోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు కాపాడారని గుర్తు చేశారు. సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు టీటీడీ అండగా నిలబడాల్సిన ఆవశ్యకత ఉందని వారు వివరించారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలను కూలంకషంగా పరిశీలిస్తున్నామని తప్పక న్యాయం చేస్తామని టీటీడీ ఇఓ శ్యామలరావు నేతలకు హామీ ఇచ్చారు.

22వ రోజు నిరసన దీక్షకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సంఘీభావం ప్రకటించారు. టిటిడి పరిపాలనా భవనం ఎదుట మంగళవారం వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని చేతుల్లో పట్టుకుని వంటినిండా నామాలు పెట్టుకుని గోవిందా అంటూ శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు వినూత్నంగా నిరసన తెలిపారు.



క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి):



నింద్ర పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వినోద్ (36) నగరి మండలం రామాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కానిస్టేబుల్ వినోద్ నింద్రలో జరిగిన వినాయక నిమజ్జనం పాల్గొన్న తరువాత అనారోగ్యసమస్య కారణంగా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు పుత్తూరు ఆసుపత్రి వెళ్లి చికిత్స తీసుకొన్నాడు. తిరిగి నగరి వస్తుండుగా రామాపురం వద్ద గుమ్మడిపుండి నుండి కడపకు వెళ న్న సిమెంట్ లారీ డ్రైవర్ ఓవర్ టేక్ చేసినప్పుడు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వినోద్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోర్టుమార్టు నిమిత్తం నగరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- గంగవరం:



మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద మంగళవారం గంగవరం పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈనేపథ్యంలో టాటా ఏసీలు తరలిస్తున్న 53 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించారు. ఈ వాహనం చిత్తూరు నుండి కర్ణాటక తరలిస్తున్నట్లు విచారణలో నిందితులు తెలుపడంతో వారి అదుపులోకి తీసుకుని బియ్యంతోపాటు వాహనం సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండలంలోని చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన ఎస్ఎస్.గిరిధర్ రెడ్డి(50) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. సోమవారం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం గిరిధర్ రెడ్డి మృతి చెందాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు.